

13న యథావిధిగా పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ఈ నెల 13వ తేదీన కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్ కార్యక్రమం యథాతథంగా జరుగుతుందని కలెక్టర్ కీర్తి చేకూరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 13వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు ఆయా ప్రధాన కార్యాలయాల్లో జిల్లా, డివిజన్, మండల స్థాయిలో నిర్వహించే పిజిఆర్ఎస్‌లో జిల్లా, రెవెన్యూ, డివిజన్ అధికారులు, ఇతర జిల్లా అధికారులు, క్షేత్ర స్థాయిలో అధికారులు అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. ప్రజలు వ్యయ ప్రయాసలకు గురికాకుండా డివిజన్, మండల, సచివాలయాల స్థాయిలోనూ అర్జీలను అందజేసేందుకు అవకాశం ఉందన్నారు. తమ అర్జీలను 1100 టోల్ ఫ్రీ నెంబర్ కు లేదా meekosam.ap.gov.in ద్వారా తెలియ చేసే అవకాశం ఉందని తెలిపారు.

అప్రమత్తతే ఆయుధం

-బాణసంచా తయారీ కేంద్రాలు 20
-రాయవరం ఘటనతో అప్రమత్తం



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

బాణసంచా తయారీ కేంద్రాలలో అప్రమత్తతే ఆయుధం. ఇటీవల రాయవరంలోని ఓ బాణసంచా తయారీ కేంద్రంలో భారీ విస్ఫోటనం జరిగి ఎనిమిది మంది మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే, ఇలాంటి ఘటనలు జిల్లాలో జరగకుండా అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. దీపావళి పండుగ వంటి సమయంలో ప్రమాదాన్ని కలిగిస్తుందో.. అప్రమత్తంగా లేకుంటే అంతటి ప్రమాదాన్ని తెచ్చిపెడుతుంది. బాణసంచా కాల్చడంలో ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా ప్రాణాలే పోతాయి. ఆస్తినష్టం భారీగానే ఉంటుంది. బాణసంచా తయారీ మొదలు, నిల్వచేయడం, తరలించడం, విక్రయాలు జరపడం, వాటిని కొనుగోలు చేసి కాల్చడం వరకు ప్రమాదాలకు ఆస్కారం ఎక్కువ. అన్నింట్లో జాగ్రత్తలు తీసుకుంటూ కాలిస్తే కలిగే ఆనందం అంతా ఇంతా కాదు. జిల్లాలో అధికారికంగా 20 తయారీ కేంద్రాలు ఉండగా వీటిలో 9వ తేదీ నాటికి ఎన్‌ఒసి ఉన్నవి కేవలం 4 మాత్రమే. అయితే రాయవరం ఘటనతో అధికార యంత్రాంగం మరో 9 కేంద్రాలకు హుటాహుటిన అనుమతులు జారీ చేశారు.

అనుమతులకు వెనకడుగు

జిల్లాలో తయారీ కేంద్రాలతో పాటు అనధికారికంగా అమ్మకాలు చేస్తున్న వారే ఎక్కువగా ఉన్నారు. అయితే అనుమతులు తీసుకునేందుకు వెనకడుగు వేస్తున్నారు. జిల్లాలో రాజమహేంద్రవరం రూరల్‌లో బొమ్మూరు, రాజానగరం, బిక్కవోలు, కడియం, చాగల్లు, సమిశ్రగూడెం, సీతానగరం, గోకవరం తదితర ప్రాంతాలలో బాణసంచా తయారీ కేంద్రాలు వాటికి అనుసంధానంగా బాణసంచా విక్రయ కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాలలో నిబంధనల ప్రకారం ప్రతి గోడౌన్‌లో స్ప్రింకర్లు ఏర్పాటు చేయాలి. నీటివంపు సెట్టు ఏర్పాటుచేసుకోవాల్సి ఉంది. అనుకోని ప్రమాదం సంభవిస్తే మంటలను ఆర్పేందుకు కనీస పరిజ్ఞానం ఉన్న సిబ్బందిని అందుబాటులో ఉంచాలి. వాస్తవానికి జిల్లాలో ఎక్కడా ఈ పరిస్థితులు కనిపించడం లేదు. పర్మినెంట్ షాపుల వద్ద స్ప్రింకర్ల మాట అటుంచితే కనీసం [illegible] కాదు కదా అగ్నిప్రమాద పరికరాలు కనిపించడం లేదు. ఇసుక బకెట్లు లేని పర్మినెంట్ గోడౌన్లు ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. పరిమితికి మించి మందుగుండు సామగ్రిని నిల్వ చేస్తున్నారు. ఏటా రెన్యువల్ చేయించే విషయంలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

జోరుగా ముడి సరుకు దిగుమతి

జిల్లాలో కొంతమంది ముడిసరుకు తెచ్చి, మూడోకంటికి తెలియకుండా అనధికారికంగా బాణసంచా తయారుచేసి అమ్మకాలు సాగిస్తున్నారు. అనుమతులు లేకుండా గోడౌన్లలో నిల్వ ఉంచి పండుగలు, పర్వదినాలు, జాతర్ల సమయాల్లో జోరుగా అమ్మకాలు చేస్తున్నారు. గంధకం, సురేకారం తదితర ముడిసరుకు అమ్మకాలు చేసే వ్యాపారులపై జిల్లా యంత్రాంగం ఓ కన్నేయాల్సి ఉంది. నిబంధనలు అమలు, బాణసంచా నిల్వలు, లైసెన్స్ గడువు, కొనుగోలుకు సంబంధించిన వివరాలు తదితర అంశాలపై జిల్లా విపత్తులు, అగ్నిమాపక, రెవెన్యూ, పోలీసు శాఖలు తనిఖీలు నిర్వహించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అగ్నిమాపక శాఖ ప్రాంతీయ అధికారి సమీక్ష సమావేశం నిర్వహించి జిల్లాలో స్థితి గతులపై విచారణ జరిపారు. అయితే ఆ శాఖాధికారుల పర్యవేక్షణ లేమి ఈ సమీక్షా సమావేశంలో తేటతెల్లమైంది. రాయవరంలో ఘటన అనంతరం జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన తనిఖీలలో అనుమతులు లేని కేంద్రాలపై కేసులు నమోదు చేశారు.

ఇవే నిబంధనలు

ప్రమాదాల నివారణకు నిర్వాహకులు, వ్యాపారులు సైతం ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సి ఉంది. నివాసాలకు దగ్గరగా తాత్కాలిక, శాశ్వత బాణసంచా విక్రయ షాపుల ఏర్పాటుకు పోలీసులు అనుమతులు ఇవ్వకూడదు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు సమీపంలో, హైటెన్షన్ విద్యుత్ తీగలకు కింద దుకాణాలు పెట్ట కూడదు. ఊరికి అవతల ఏర్పాటయ్యేలా అధికారులు చూడాలి. దుకాణాల మధ్య మూడు మీటర్ల దూరం ఉండేలా చూడాలి. పొగ తాగరాదనే బోర్డులు ఏర్పాటు చేయాలి. నీటి సదుపాయం కల్పించాలి. డ్రై కెమికల్ పౌడర్ నాలుగైదు కిలోలు, సిఒటు (కార్బన్ డై ఆక్సైడ్) ఐదు కిలోలు దుకాణం వద్ద ఉండేలా చూడాలి. నిబంధనలకు మించి నిల్వలు ఉంచకూడదు. చిన్నపిల్లలను పనిలో పెట్టుకోకూడదు. అగ్నిమాపక సాధనాలను అందుబాటులో ఉంచాలి.



ఆహార మహోత్సవం బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న విసి ప్రసన్నశ్రీ, అధ్యాపక బృందం

14 నుంచి మెగా ఫుడ్ ఫెస్టివల్

ప్రజాశక్తి - రాజానగరం

ఆదికవి నన్నయ యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఆహార మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు విసి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. శనివారం అరటి ఆకులపై వినూత్న రీతిలో సిద్ధం చేసిన ఆహార మహోత్సవం బ్రోచర్‌ను విసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ అక్టోబర్ 16 ప్రపంచ ఆహార దినోత్సవాన్ని పురస్కరించుకుని 14, 15, 16 తేదీల్లో ఆహార మహోత్సవం పేరుతో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నామన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్‌లతో పాటు ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని అనుబంధ కళాశాలల నుంచి సిబ్బంది, విద్యార్థుల కుటుంబ సభ్యులు, స్నేహితులు అందరూ దీనిలో భాగస్వామ్యం కావచ్చునని అన్నారు. మెగా ఫుడ్ ఫెస్టివల్‌కు సంబంధించి 14వ తేదీ క్విజ్, డిబేట్, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ నిర్వహిస్తారని తెలిపారు. అలాగే 15, 16 తేదీల్లో ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఆసక్తి గలవారు వంటలు సిద్ధం చేసుకుని యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో ప్రదర్శించవచ్చునని చెప్పారు. చక్కని విభిన్న రుచులతో ఆరోగ్యకరమైన, సంప్రదాయ వంటలను ప్రదర్శించిన వారి ప్రతిభను గుర్తించి 16వ తేదీ బహుమతులు ప్రదానం చేస్తామని, ఫుడ్ స్టాల్ ఏర్పాటు చేసిన ప్రతి ఒక్కరికీ భాగస్వామ్య సర్టిఫికెట్లను అందిస్తామని తెలిపారు. ఆధునిక జీవితంలో ప్రపంచీకరణ ప్రభావంతో ఆత్మీయతలు, అనుబంధాలు మాయమై సంస్కృతి, సంప్రదాయాలు కనుమరుగవుతున్నాయని అన్నారు. తరాల మధ్య సంబంధాన్ని చాటి చెప్పేందుకు చక్కని కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. గోదావరి జిల్లా వంటల గొప్పతనాన్ని తెలియజేయాలనే ప్రయత్నం ఆహార మహోత్సవం లక్ష్యం అన్నారు. 1960ల ముందు అమ్మమ్మ, నాన్నమ్మలు వండిన వంటలు, 1980ల ముందు వచ్చిన, తర్వాత వచ్చిన కొత్త కొత్త వంటలు, 2001 నుంచి ఈమధ్య కాలంలో వచ్చిన కొత్త కొత్త ఆహారపు అలవాట్లు, వంటలు వీటన్నింటిని ప్రదర్శించేందుకు నన్నయ వర్సిటీ మెగా ఫుడ్ ఫెస్టివల్ వేదిక అవుతుందన్నారు. నాన్నమ్మ తాతయ్యల ఒడిలోని వెచ్చదనం ఎలా కోల్పోయామో ఆరోగ్యకరమైన వంటల గొప్పతనాన్ని మనం కోల్పోతున్న దశలో ఉన్నామని, అవన్నీ ఇవాళ జనరేషన్‌కి తెలియాల్సిన అవసరం తప్పనిసరిగా ఉందన్నారు. కాబట్టి అందరూ దీనిలో భాగస్వామ్యమై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మరిన్ని వివరాలకు, పార్టిసిపేట్ చేసేందుకు యూనివర్సిటీ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం 8639550186 లేదా యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కెవి.స్వామి, ప్రిన్సిపల్ డాక్టర్ పి. విజయనిర్మల, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగాధిపతి ఆచార్య డి.కల్యాణి, అధ్యాపకులు ఎంఎం.కృష్ణవేణి, కె.సింధుజ, తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి నిమ్మల పర్యటన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామనాయుడు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఆదివారం పర్యటించనున్నారు. ఉదయం పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు నుంచి రోడ్డు మార్గంలో ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటలకు పెద్దాపురం చేరుతారు. అక్కడ ఒక ప్రయివేటు కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3.00 గంటలకు పెద్దాపురం నుంచి జగ్గంపేట చేరుకుని మామిడాడ వద్ద జ్యోతుల పాపారావు లిఫ్ట్ ఇరిగేషన్ పథకం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సాయంత్రం 4.00 గంటలకు జగ్గంపేట నుంచి బయలుదేరి సాయంత్రం 5.00 గంటలకు రాజమహేంద్రవరం చేరుకుంటారు. శెట్టిబలిజ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం నగరంలోని ఒక ప్రయివేట్ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం రాత్రి 9.30 గంటలకు విజయవాడ క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు.

14న మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ఈ నెల 14న వికాస ప్రాజెక్టు ఆధ్వర్యంలో విఎంఎస్ కంపెనీలో ఉద్యోగావకాశాల కోసం మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కీర్తి చేకూరి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయంలో మంగళవారం ఉదయం 9.30 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని చెప్పారు. గత వారం వాయుపుత్ర మేనేజ్‌మెంట్ సర్వీసెస్ ప్రయివేట్ లిమిటెడ్‌లతో కలెక్టర్ సమావేశం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన వారు అర్హులని, ఎంపికైన వారికి నెలకు రూ.23 వేలు జీతం ఉంటుందన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు విద్యా అర్హతలు, ఇతర ధ్రువపత్రాలు, జెరాక్స్ కాపీలతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 7660823903 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని వికాస పీడీ కె.లచ్చారావు కోరారు.



రాంబాబుకు అవార్డును అందచేస్తున్న అధికారి

స్వర్ణాంధ్ర సేవలు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

వృద్ధులు, ఒంటరి జీవుల సంరక్షణలో స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమం అందిస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని దివ్యాంగుల ట్రాన్స్‌జెండర్స్ వయోవృద్ధుల జిల్లా సహాయ సంచాలకులు ఎవై.శ్రీనివాస్ కొనియాడారు. శనివారం స్థానిక స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమ ప్రాంగణంలో ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా స్వర్ణాంధ్రకు ఉత్తమ వృద్ధాశ్రమ అవార్డును సంస్థ నిర్వాహకులు డాక్టర్ గుబ్బల రాంబాబుకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలోని వృద్ధాశ్రమాల నిర్వహణలో స్వర్ణాంధ్ర మంచి పనితీరు ప్రదర్శిస్తుందని అన్నారు. స్వర్ణాంధ్ర సేవలను పరిశీలించి ఉత్తమ నిర్వహణ సంస్థగా అవార్డును అందించినట్లు తెలిపారు. స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమం నిర్వా హకులు రాంబాబు మాట్లాడుతూ నగర ప్రజలు, దాతల సహకారంతో స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమాన్ని నడిపిస్తున్నామని అన్నారు. వృద్ధాశ్రమ నిర్వహణకు జిల్లా స్థాయి ఉత్తమ అవార్డు రావడం గర్వంగా ఉందన్నారు. స్వర్ణాంధ్ర నిర్వహణకు కష్టపడుతున్న సిబ్బం దికి రాంబాబు అవార్డుని అంకితం చేస్తున్నా నన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిట ిజన్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బుద్ధరాజు సత్యనారాయణరాజు, స్వర్ణాంధ్ర సిబ్బంది పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పాలన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కూటమి పాలన అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతుందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో పాటు ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ఇవ్వని హామీలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విశాఖపట్నంలో గూగుల్‌తో సహా మూడు డేటా సెంటర్లు రానున్నాయని, దీనివల్ల వేలాది మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయని చెప్పారు. సిఎం చంద్రబాబు, డిసిఎం పవన్ కల్యాణ్ నాయకత్వంలో పారిశ్రామిక వేత్తలకు అనుకూల వాతావరణం సృష్టించబడుతోందని తెలిపారు. స్త్రీ శక్తి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు ఆర్‌టిసి ఆక్యుపెన్సీ పెంపు చర్యలు చేపట్టామని వివరించారు. ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం,



మీడియాతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ గోరంట్ల

పెండింగ్ కేసులు, పెనాల్టీలను రద్దు చేయడం వంటి నిర్ణయాలతో ప్రభుత్వం చిన్న, మధ్యతరగతి వర్గాలకు అండగా నిలుస్తోందన్నారు. పిపిపి విధానంలో ప్రాజెక్టులను చేపట్టడం ద్వారా విద్యా, వైద్య రంగాల్లో సదుపాయాలు మెరుగుపడతాయని అన్నారు. మెడికల్ కాలేజీలకు నిధుల కేటాయింపుతో పాటు మౌలిక వసతుల అభివృద్ధి దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకానికి బడ్జెట్ కేటాయింపులు ప్రత్యేకంగా ఉన్నాయని, సిఎం రిలీఫ్ ఫండ్ వేరుగా నడుస్తుందని చెప్పారు. రూరల్ నియోజక వర్గంలో ఇప్పటివరకు 212 మందికి రూ.2.40 కోట్లకుపైగా సిఎంఆర్ఎఫ్ కింద సాయం అందించామని వెల్లడించారు. రూరల్ నియోజకవర్గంలో రూ.9.20 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతిపక్షాలు అనవసర ఆరోపణలు విడనాడి రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వానికి సహకరించాలని ఆయన కోరారు. అనంతరం సిఎంఆర్ఎఫ్ నుంచి విడుదలైన రూ.10,07,619 విలువ చేసే చెక్కులను బాధితులకు అందజేశారు. ఈ సమావేశంలో టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ మార్ని వాసుదేవ్, ఎంపిపి వెలుగు బంటి ప్రసాద్, స్థానిక నాయకులు మత్సేటి శివసత్యప్రసాద్, పండూరి అప్పారావు, శీలం గోవింద్ పాల్గొన్నారు.

సత్యదేవా నర్సరీలో హైకోర్టు న్యాయమూర్తి

ప్రజాశక్తి - కడియం



జడ్జ్‌కి మొక్కను అందిస్తున్న పుల్లా ఆంజనేయులు

మండలంలోని కడియపులంకలో ఉన్న సత్యదేవా నర్సరీనీ ఎపి హైకోర్టు అదనపు న్యాయమూర్తి సుమతి జగదం శనివారం సందర్శించారు. ఆమెకు నర్సరీ అధినేత పుల్లా ఆంజనేయులు ఆగ్లోనిమా మొక్కతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె నర్సరీలోని పలు రకాల పండ్ల, పూల మొక్కల గురించి తెలుసుకుని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నర్సరీలను చూస్తుంటే రైతుల యొక్క శ్రమ, పనితనం సంభ్రమాశ్చర్యాలకు గురి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పుల్లా పెద్ద సత్యనారాయణ, పుల్లా చిన్న సత్యనారాయణ పాల్గొన్నారు.

క్రీడా పోటీలకు తపస్విరెడ్డి ఎంపిక

ప్రజాశక్తి - నిడదవోలు రూరల్

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించే పోటీలకు అండర్ 14 విభాగంలో నారాయణ పాఠశాల విద్యార్థి స్థితప్రజ్ఞ తపస్వి రెడ్డి ఎంపికయ్యాడు. నియోజకవర్గ స్థాయిలో జరిగే చదరంగం, షటిల్ బ్యాడ్మింటన్ రెండు పోటీలకు ఎంపికయిన తపస్విరెడ్డిని పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

ప్రజాశక్తి - కొవ్వూరు, తాళ్లపూడి



తాళ్లపూడిలో చెక్‌ను ఇస్తున్న ఎంఎల్ఎ ముప్పిడి

మండలంలోని దొమ్మేరు గ్రామానికి చెందిన కోడి శ్రీరామ మూర్తికి మంజూరు అయిన సిఎంఆర్ఎఫ్ చెక్‌ను శనివారం టిడిపి నాయకుడు పెండ్యాల అచ్యుత రామయ్య అందజేశారు. రూ.35 వేలు విలువ చేసే ఎల్ఒసి పత్రాన్ని బాధితునికి అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకుడు కెవికె.రంగారావు, ఇతర నాయకులు పాల్గొన్నారు. అలాగే తాళ్లపూడి మండలంలోని అన్నదేవరపేట గ్రామానికి చెందిన బేతాళ రాధకు మంజూరు అయిన రూ.65 వేల విడుదల చేసి సిఎంఆర్ఎఫ్ చెక్‌ను ఎంఎల్ఎ ముప్పిడి వేంకటేశ్వరరావు అందజేశారు. అనంతరం జాన్ పేటలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు

ఐద్వా మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

అనంతపురంలో ఈ నెల 13,14,15 తేదీల్లో అనంతపురంలో జరిగే ఐద్వా 16 వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని ఐద్వా నాయకులు పిలుపునిచ్చారు. నగరంలోని గోరక్షణపేటలో ఐద్వా నాయకురాలు కాశీ అన్నపూర్ణదేవి ఆధ్వర్యంలో ఐద్వా జెండా ఆవిష్కరణ జరిగింది. సీనియర్ నాయకురాలు టి.సావిత్రి ఐద్వా పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న హింస, దాడులు, అత్యాచారాలు అరికట్టాలన్నారు. చట్ట సభల్లో మహిళ రిజర్వేషన్లు అమలు



సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా నాయకురాలు సావిత్రి

చేయాలని, మహిళల రక్షణకు ఉన్న చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మద్యం, బెల్టు షాపులను అరికట్టాలని, కూటమి ప్రభుత్వం సూపర్ 6 హామీలను అమలు చేయాలన్నారు. 18ఏళ్ల నిండిన మహిళలకు నెలకు రూ.1,500 ఇవ్వాలన్నారు. మహిళల సమస్యలపై రాష్ట్ర మహాసభలో చర్చ ఉంటుందన్నారు. దీన్ని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బి.పూర్ణిమరాజు, ఐద్వా నాయకులు అన్నపూర్ణ, స్రవంతి, లీల, పద్మ, కృష్ణవేణి, సునీత, సత్యవతి, గాయత్రి, రామలక్ష్మి, లోహిత, రమ్య, ఇషాఛన్విక తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి సేవలు మరింత చేరువ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

సమస్యలను త్వరితగతిన పరిష్కరించి ఆర్‌టిసి సేవలను ప్రయాణీకులకు మరింత చేరువ చేస్తామని రాజమహేంద్రవరం ఆర్‌టిసి డిపో మేనేజర్ మాధవ అన్నారు. శనివారం డిఎం చాంబర్‌లో నిర్వహించిన డయల్ యువర్ డిఎం కార్యక్రమంలో ప్రయాణీకులతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ప్రయాణీకుల అభ్యర్థలనపై సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా కడియం వేమగిరి గట్టుకు చెందిన ఎం వెంకట రమణ మాట్లాడుతూ వేమగిరి గట్టు వద్ద రిక్వెస్ట్ స్టాప్ ఉన్నా సరే బస్సులు ఆపడం లేదు అని తెలిపారు. డిఎం స్పందించి ప్రయాణికులు చేయి ఎత్తిన చోట ఎక్కించుకుని, వారు కోరిన చోట దించాలని సిబ్బందికి అందేశాలు ఇచ్చినట్లు తెలిపారు. కుక్కునూరు నుంచి కె.లక్ష్మయ్య మాట్లాడుతూ రాజమహేంద్రవరం నుంచి భద్రాచలం వయ కుక్కునూరు బస్సులు అల్ట్రా డీలక్స్ వలన స్త్రీ శక్తి పథకం అమలు కావడం లేదని, పురుషులు ఎక్స్‌ప్రెస్ ఛార్జ్ కంటే ఎక్కువగా చెల్లించాల్సి వస్తుందన్నారు. దీనిపై డిఎం సానుకూలంగా స్పందించారు. అంతరాష్ట్ర సర్వీసులకు, ఇతర రాష్ట్రాలలో 16 కిలోమీటర్ల లోపు ప్రయాణ పరిధి ఉన్నప్పుడు మాత్రమే స్త్రీ శక్తి పథకం వర్తిస్తుందన్నారు. కావున భద్రాచలం రూటులో స్త్రీ శక్తి పథకం వర్తించదని, వివరించారు. ఇలా పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు డయల్ యువర్ డిఎం కార్యక్రమంలో పాల్గొని తమ సమస్యను డిఎం దృష్టికి తీసుకొచ్చారు.



డిఎం మాధవ

జిఎస్‌టి తగ్గింపుపై అవగాహన

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండంలోని అన్నదేవరపేటలో శనివారం జిఎస్‌టి తగ్గింపుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువ నేత అల్లూరి విక్రమాదిత్య, సొసైటీ అధ్యక్షులు జివి.ప్రసాద్, నాయకులు కొటారు వెంకట్రావు, కాకర్ల సత్యేంద్ర, కూచిపూడి గణపతి, సిహెచ్.బంగార్రాజు, కప్పల ధనలక్ష్మి, సిహెచ్.రాము పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, నిర్వాహకులు

మానసిక ఆరోగ్యం ఎంతో అవసరం

ప్రజాశక్తి - చాగల్లు

శారీరక ఆరోగ్యంతోపాటు, మానసిక ఆరోగ్యం మనిషికి ఎంతో అవసరమని పలువురు అన్నారు. శనివారం స్థానిక లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 'మెంటల్ హెల్త్ అండ్ వెల్ బీయింగ్' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. లైన్స్ క్లబ్ అధ్యక్షులు వి.వెంకటరామారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా లైన్ డాక్టర్ కుడారి ఆనంద్, లైన్ కుడారి సజిని మాట్లాడారు. శారీరక ఆరోగ్యం ఎంత అవసరమో మానసిక ఆరోగ్యం కూడా అంతే అవసరమని అన్నారు. ఈ రెండు సమతుల్యంగా ఉన్నప్పుడే మనిషి ఆరోగ్యంగా ఉంటాడని అన్నారు. ఈ కార్యక్రమాన్ని డిస్ట్రిక్ట్ గాట్ సర్వీస్ కోఆర్డినేటర్ లైన్ వంక రాజకుమారి ప్రారంభించారు. యోగ ట్రైనర్ లయన్స్ మాదిరెడ్డి బాబూజీరావు విద్యార్థులతో శాంతి ప్రతిజ్ఞను చేయించారు. ఈ సదస్సులో జోన్ మాజీ ఛైర్మన్ లైన్ కోడి శ్రీనివాస్, సెక్రటరీ లైన్ రాంప్రసాద్, ట్రెజరర్ లైన్ నాగేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి స్థలం కేటాయింపు

ప్రజాశక్తి - నల్లజర్ల



ప్రింటర్‌ను అందజేస్తున్న దాత విజయరాణి

నల్లజర్ల మండల విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనం నిర్మించేందుకు స్థలాన్ని కేటాయిస్తానని సొసైటీ అధ్యక్షుడు రావూరి వెంకటరమణ హామీ ఇచ్చారు. సంఘం అధ్యక్షులు ఐవి.సత్యం అధ్యక్షతన శనివారం స్థానిక సొసైటీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశం జరిగింది. అనంతరం కుటుంబ పెన్షనర్ విజయరాగిణి తన భర్త మల్లెపూడి వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం ప్రింటర్‌ని సంఘానికి బహుకరించారు. ఈ కార్యక్రమంలో అకిరా కంటి ఆసుపత్రి మేనేజర్ నారాయణరావు విశ్రాంత ఉద్యోగులకు కంటి వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, పాకలపాటి వెంకటేశ్వరరావు, విశ్రాంత ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షులు ఉన్నమట్ల వెంకటేశ్వరరావు, కామేశ్వరరావు, యేసురత్నం, ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జిఎస్‌కెఎం న్యాయ కళాశాల స్నాతకోత్సవం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

స్థానిక పిడింగొయ్యిలోని జిఎస్‌కెఎం న్యాయ కళాశాల 41 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. న్యాయవాద కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఎఎంసి ఛైర్మన్ మార్ని వాసుదేవ్, సీనియర్ న్యాయవాది ముప్పాళ్ళ సుబ్బారావు, కాలేజీ డైరెక్టర్ శరత్‌కృష్ణ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో చీకట్లు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

సర్కారు అలసత్వం.. నిర్లక్ష్యం... పేదల జీవితాలను చీకట్లోకి దొనేస్తోంది. కూటమి పాలనలో ప్రజలకు భద్రతా, భరోసా రోజురోజుకూ కరువవుతున్నాయి. సమస్యలపై పలు రంగాల కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు రోడ్డెక్కుతున్నా దున్నపోతు మీద వానచందంగా సర్కారు వ్యవహరిస్తుంది. ఆపదలో ఉన్న కుటుంబాలు పట్ల కనికరం లేకుండా వ్యవహరిస్తుంది. ఇటీవల రాయవరం మండలంలో జరిగిన భారీ అగ్నిప్రమాద ఘటనే దీనికి నిదర్శనంగా నిలుస్తోంది. రాయవరం మండలం కొమరిపాలెంలోని బాణసంచా తయారీకేంద్రంలో జరిగిన అగ్నిప్రమాదంలో 8 మంది మృత్యువాత పడ్డారు. మరో ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనలో ప్రభుత్వం, అధికారులు వ్యవహరించిన తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఘటన జరిగిన సమయంలో ఎంత మంది కూలీలు ఉన్నారనే విషయంపై ఇప్పటికీ స్పష్టత లేదు. నిబంధనల ప్రకారం ఎంత మంది పనిచేయాలి, ఈ యూనిట్‌లో ఎంత మంది పనిలో ఉన్నారనే విషయంపైనే అధికారులు ఎలాంటి ప్రకటనా చేయలేదు. అన్ని అనుమతులు ఉన్న యూనిట్‌లో ప్రమాదం జరిగడం, ఆ పరిసర ప్రాంతాల్లో ఇతర తయారీ కేంద్రాలకు అనుమతులు లేవని అధికారులు తప్పుడు లెక్కలు ఇవ్వడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై ఉన్నతస్థాయి విచారణ కమిటీ రంగంలోకి దిగనుంది. సోమవారం కమిటీ దీనిపై విచారణకు వచ్చే అవకాశం ఉంది. ఈ ఘటనలో 8 మంది మృత్యువాత పడినా మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎటువంటి భరోసా లభించలేదు. కనీసం నష్టపరిహారం కూడా ప్రకటించలేదు. ఈ ఘటన జరిగిన రోజు నుంచి మాత్రం ఆఘమేఘాలపై అధికారులు తనిఖీలు నిర్వహిస్తూ అనుమతులు లేని, ఆక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచా సామగ్రిని మాత్రం పెద్ద ఎత్తున సీజ్ చేస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో తప్ప ఇతర సందర్భాల్లో తనిఖీలు నిర్వహించిన దాఖలాలు కనిపించవు. ఈ సారి అధికారులు ఇదే పంథాలో సాగడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ పర్యటనకు ముందు రోజే జరిగిన ఈ ప్రమాదంపై కనీసం స్పందించకపోవడం విస్మయానికి గురిచేసింది. ఈ ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలను మంత్రి సుభాష్ మొక్కుబడిగా పరామర్శించి చేతులు దులుపుకున్నారనే అభిప్రాయం జిల్లా వాసులలో వ్యక్తమవుతోంది.

కూటమి వస్తే తమ జీవితాలు బాగుపడతాయి అనుకున్న మత్స్యకారుల ఆశ అడియాశలయ్యాయి. సమస్యలు పరిష్కరించాలని పిఠాపురం నియోజకవర్గంలో మత్స్యకారులు కొన్ని రోజులుగా వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్నారు. ఎట్టకేలకు స్పందించిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఇటీవల పిఠాపురం వచ్చారు. మత్స్యకారులతో సమావేశమయ్యారు. వెంటనే సమస్య పరిష్కారం అవుతుందని అందరూ ఆశించినా ఆయన పర్యటన వల్ల ఒనగూరిందేమీ లేదు. వచ్చి పాతపాటే పాడి మరో వంద రోజుల సమయం ఇస్తే సమస్యను పరిష్కరిస్తానని చెప్పారు. మత్స్యకారుల ఉపాధితో పాటు, పరిశ్రమలూ అవసరమేనంటూ తన వైఖరిని చెప్పకనే చెప్పారు. చివరకు స్పష్టమైన భరోసా ఇవ్వకపోగా పరిశ్రమల శాఖ మంత్రితో చర్చించాలి, మత్స్యశాఖ మంత్రితో మాట్లాడాలి, కమిటీ వేస్తాం, 100 రోజుల్లో తమ అభిప్రాయాన్ని వెల్లడిస్తామంటూ వచ్చిన దారినే వెనుతిరిగడం సర్వత్రా విమర్శలకు దారితీసింది. పిఠాపురంలోనే ఉంటానంటూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని గెలిచిన తొలి నెలలోనే బుట్టదాఖలు చేసిన సదరు ప్రజా ప్రతినిధి, తన నియోజక వర్గంలో ప్రజల సమస్యలు సైతం తన పరిధిలో లేవంటూ చెప్పిన తీరుతో ప్రజలు అవాక్కయ్యారు.

సిజెఐపై దాడితో మిన్నంటిన నిరసనలు

దేశ అత్యున్నత న్యాయమూర్తిపై జరిగిన దాడి ప్రస్తుత పాలనా వ్యవస్థ తీరును దర్పణం పట్టింది. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 11 ఏళ్లలో వినాశకర సామాజిక, ఆర్థిక, రాజకీయ విధానాలను అనుసరిస్తున్న విషయం విధితమే. ప్రజలందరూ తమ భావజాలాన్ని ఆమోదించాలని, ప్రశ్నించిన వారిపై దాడులు తప్పవంటూ తెగబడుతున్న విషయం విధితయే. సిజెఐపై దాడిని కెవిపిఎస్‌తో పాటూ పలు దళిత, ప్రజాసంఘాలు తీవ్రంగా ఖండించాయి. వివిధ రూపాల్లో నిరసనలు తెలిపాయి. న్యాయ వ్యవస్థలో అత్యున్నత స్థాయిలో ఉన్న వ్యక్తిపైనే ఇటువంటి ఘటనలు చోటు చేసుకోవడాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

పనిగంటల పెంపుపై కార్మికులు భగ్గు

పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలకు తూట్లు పొడుస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం వంత పలకడంపై కార్మికులు, కార్మిక సంఘాలు భగ్గుమంటున్నాయి. తాజాగా 8 గంటల పనివిధానాన్ని 12 గంటలకు మార్పు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. సంపద సృష్టించేది పారిశ్రామిక వేత్తలేనంటూ వక్రభాష్యం చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు కార్మికులపై పని భారం మోపడం ఎందుకనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచించి ఇటువంటి నిర్ణయాలను వెనక్కి తీసుకోకుంటే కార్మికుల ఆగ్రహానికి గురికాక తప్పదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.



నేరాలు ఘోరాలు

మహిళపై గుర్తు తెలీని వ్యక్తి దాడి

ప్రజాశక్తి - పెరవలి

తణుకు మండలం వేల్పూరు గ్రామానికి చెందిన బండారు పున్నమ్మపై గుర్తు తెలియని వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 9వ తేదీ రాత్రి 9.30 సమయంలో ఖండవల్లి పుంత రోడ్డు వద్ద ఆటో దిగి రోడ్డుపై నిలబడింది. అదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఆమె వద్దకు వచ్చి కత్తితో దాడి చేశాడు. దీంతో ఆమె కేకలు వేయడంతో అతడు పరారయ్యాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - కడియం

స్థానిక పెద్ద చెరువు గట్టుపై శనివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చెరువు గట్టుపై తమ్మా కాంతమ్మ నివాసం ఉంటుంది. వంట గ్యాస్ లీక్ అవడంతో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగి ఇల్లు కాలి బూడిద అయినట్లు తెలిపారు. స్థానికుల సమాచారంతో రాజమహేంద్రవరం అగ్నిమాపక వాహన సిబ్బంది కడియం చేరుకుని మంటలు పక్క గృహాలకు వ్యాపించకుండా చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న వైసిపి రాష్ట్ర కార్యదర్శి గిరిజాల బాబు,ఉప సర్పంచ్ వెలుగుబంటి నాని ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

యానాంలో వ్యక్తి హత్య

ప్రజాశక్తి - యానాం

పాత కక్షల నేపథ్యంలో అతి కిరాతకంగా ఒక వ్యక్తిని పొడిచి చంపిన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. గతంలో కాజులూరు మండలం సుబ్బారాయుడు వీధికి చెందిన త్రిపురశెట్టి నారాయణ స్వామి యానాం గోపాల్ నగర్‌లో మోకా వెంకటేశ్వరరావును ఇంటి వద్దే నరికి చంపాడు. ఆ కక్షతో వెంకటేశ్వరరావు కుమారుడు శనివారం రాత్రి యానాం పద్మా థియేటర్ సమీపంలో నారాయణస్వామి (33)ని హత్య చేసి పరారైనట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ఎస్‌పి వరదరాజన్ ఆధ్వర్యంలో ఎస్ఐ పునీత్ రాజ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పిడిఎస్ రైస్ వ్యాన్ పట్టివేత

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని రామవరం వద్ద పిడిఎస్ రైస్ వాహనాన్ని శనివారం తెల్లవారుజామున విజిలెన్స్ పోలీసులు పట్టుకున్నారు. పిఠాపురం నుండి జగ్గంపేట వైపు ప్రజా పంపిణి బియ్యం బస్తాలతో వెళ్తున్న వ్యాన్‌ను రామవరం వద్ద తనిఖీ చేసి పట్టుకున్నట్లు విజిలెన్స్ సిఐ టి.నాగవెంకటరాజు తెలిపారు. వ్యాన్‌లో సుమారు 4,059 కేజీల పిడిఎస్ రైస్ ఉందని, ఆ వ్యాన్‌ను సివిల్ సప్లైస్ అధికారి నాగబాబుకు అప్పగించినట్టు తెలిపారు. స్థానిక పోలీసులకు పిర్యాదు చేసి బియ్యం బస్తాలను రామవరం స్టాక్ పాయింట్‌కు అప్పగించినట్లు ఎంఎస్ఒ నాగబాబు తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - సామర్లకోట

మున్సిపాలిటీల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అందులో భాగంగా సామర్లకోట మున్సిపాలిటీ పరిధిలో రూ.10 కోట్లతో రోడ్లు, డ్రెయినేజీలు అభివృద్ధి చేయనున్నట్లు పెద్దాపురం ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప తెలిపారు. సామర్లకోట పట్టణ పరిధి 28వ వార్డులో నూతన రోడ్ల నిర్మాణ పనులకు పెద్దాపురం ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కొబ్బరికాయ కొట్టి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ చినరాజప్ప మాట్లాడుతూ సామర్లకోట మున్సిపాలిటీ పరిధిలో రూ.10 కోట్ల నిధులతో రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించబోతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్, భీమేశ్వర ఆలయం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కంటే జగదీష్ మోహన్(బాబు), కూటమి నాయకులు సరోజ వాసు, నూనె రామారావు, అడబాల కుమార స్వామి, బలుసు వాసు, గొల్తి సత్యనారాయణ, బొందల రామలక్ష్మి, సొసైటీ చైర్మన్ శీనివాసరావు పాల్గొన్నారు.

లాండ్రీ సర్వీస్‌ను ప్రారంభించిన ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక గోకవరం రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన జికె.లాండ్రీ సర్వీసెస్, డ్రై వాష్ సెంటర్‌ను ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ, టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ శనివారం ప్రారంభించారు. లాండ్రీ సర్వీసెస్ అధినేత గంజేటి మూలాస్వామి మాట్లాడుతూ ఈ పరిసర ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఖరీదైన వస్త్రాలను లాండ్రీ, డ్రైవాష్ క్లీనింగ్ చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అత్తులూరి నాగబాబు, రాజపూడి సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి బుల్లెబ్బు, టిడిపి నాయకులు ఎస్వీఎస్ అప్పలరాజు, కొత్త కొండబాబు, జీను మణిబాబు, ముంద్రు ఎర్రబాబు, సర్వసిద్ధి లక్ష్మణరావు, పాండ్రంగి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానం చైర్మన్‌గా 'చిక్కాల'

ప్రజాశక్తి - ఏలేశ్వరం

లింగంపర్తి సీతారామ స్వామి దేవస్థానం చైర్మన్‌గా చిక్కాల లక్ష్మణరావు నియమితులయ్యారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే లింగంపర్తి దేవస్థానం చైర్మన్ పదవికి ఎంతోమంది పోటీ పడగా లక్ష్మణరావుకు ప్రత్తిపాడు ఎంఎల్‌ఎ సత్యప్రభ, కూటమి నాయకుల ఆశీస్సులతో లభించింది. వైస్ చైర్‌పర్సన్‌గా పెంటకోట పద్మారాణి, డైరెక్టర్లుగా కోట జానికి, కీలు సత్యవేణి, బుగతా సుగుణ, పితాని మాధురి, మద్దిల రాజేష్, ఉడతల రమణారావు నియమితులయ్యారు. వీరి నియామకంపై పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు లింగంపల్లి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మద్యాన్ని ఆదాయ వనరుగా చూడరాదు

ప్రజాశక్తి - పిఠాపురం

ప్రభుత్వాలు మద్యం అమ్మకాలను ఆదాయ వనరుగా చూడరాదని మద్యం మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచార కమిటీ కన్వీనర్ డాక్టర్ ఎన్.సూర్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పాలక, ప్రతిపక్షాలు కేవలం మద్యాన్ని ఒక ఆదాయ వనరుగా మాత్రమే చూస్తున్నాయని విమర్శించారు. దీనివల్ల కల్తీ మద్యం విక్రయాలు సాగుతున్నాయని విమర్శించారు. కల్తీ మద్యం సేవించి ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాలకు ముప్పు తెచ్చే మద్యాన్ని విక్రయించడం రాజ్యాంగ విరుద్ధం అన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలిక దినోత్సవం



ఆర్ట్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అధికారులు

ప్రజాశక్తి - యంత్రాంగం

రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఉన్న ఎస్‌టి పోస్ట్‌మెట్రిక్ గర్ల్స్ హై స్కూల్‌లో అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. డిఎంహెచ్ఒ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలిక ఒక కుటుంబానికి వెలుగు, ఒక తరం అభివృద్ధికి పునాది అని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డెమో సత్యకుమార్ నల్లూరి, కంబాలపేట వైద్యాధికారి డాక్టర్ ఎం.అనూహ్య, హాస్టల్ వార్డెన్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ షమ్మీకుమార్, సుధీర్, సిసి రాజు వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఆర్ట్స్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి పాల్గొని బాలికల ఆరోగ్యం, ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కె, సిఐ మంగాదేవి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీరామ్‌మూర్తి, మహిళా సాధికారత విభాగ సమన్వయకర్త డాక్టర్ పి.సురేఖ, బి.దుర్గాలక్ష్మి, జి.సుభాషిణి, డాక్టర్ కె.అనూష, పద్మ, విద్యార్థులు పాల్గొన్నారు. **గోకవరం** స్థానిక ప్రభుత్వ ఎస్‌టి గర్ల్స్ పోస్ట్ మెట్రిక్ హాస్టల్‌లో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విఘ్నేశ్వరరావు బాలికల ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించారు. అనంతరం హాస్టల్ వార్డెన్ శంభుడు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సంజీవయ్యనగర్‌లోని సాంఘిక సంక్షేమ హాస్టల్ బాలికలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. **పెరవలి** మండలంలోని కానూరు పిహెచ్‌సి-2లో అంతర్జాతీయ బాలికా దినత్సవాన్ని నిర్వహించారు. పిహెచ్‌సి ఇన్‌ఛార్జ్ డాక్టర్ టి. లావణ్య బాలికల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ డి.శాంతకుమారి, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని దూరం చేసిన చంద్రబాబు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్రావు

ప్రజాశక్తి - తాళ్లపూడి

అన్ని వర్గాలకు సంక్షేమాన్ని దూరం చేసిన ఘనత సిఎం చంద్రబాబుకే దక్కుతుందని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త తలారి వెంకట్రావు అన్నారు. శనివారం మండలంలోని వేగేశ్వరపురం గ్రామంలో వైసిపి నాయకుడు కొమ్మిరెడ్డి పరశురామారావు అధ్యక్షతన 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు అందించవలసిన ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేసిన ఘనత చంద్రబాబుదేనని విమర్శించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను సైతం ప్రయివేటీకరణ చేయడం దారుణ మన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి జొన్నకూటి పోసిరాజు, ఎంపిటిసి లక్ష్మణరావు, నాయకులు పిట్టా శ్రీను, సిద్ధంశెట్టి కృష్ణ, సూలా పోశియ్య, గూడా విజయరాజు, నామా ప్రకాశం పాల్గొన్నారు.

బార్‌ను తొలగించాలంటూ కొనసాగిన నిరసన

ప్రజాశక్తి - నిడదవోలు


నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న జువ్వల

నివాస ప్రాంతాల మధ్యలో ఉన్న చైతన్య బార్ అండ్ రెస్టారెంట్‌ను తొలగించాలంటూ చేపట్టిన నిరసన శనివారం నాటికి 19వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ జనవాసాల మధ్య ఏర్పాటు చేసిన బార్‌ను రద్దు చేయాలని పరిసర ప్రాంతాల ప్రజలు ఆందోళన నిర్వహిస్తున్న అధికారులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి రెండు వారాలు గడిచినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో దయామణి, పమ్మి రామలక్ష్మి, జువ్వల రాంబాబు, బైపే రాజేశ్వరరావు, ఈమని గ్రీష్మకుమార్, విజయ్‌సారధి, తాడేపల్లి రవి, బైపే ప్రసాద్, కోడి సుజ్ఞాన్‌రాజు, అంబటి పుల్లారావు, కె.జార్జి, వై పైడయ్య పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

ప్రజాశక్తి - పెరవలి


ఆసుపత్రిని ప్రారంభిస్తున్న మంత్రి కందుల

పేదలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శనివారం స్థానిక డిసిసిబి బ్రాంచ్ ఎదురుగా ఏర్పాటు చేసిన విష్ణు డెంటల్ క్లినిక్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో నిరుపేద, మధ్య తరగతి ప్రజలకు నాణ్యమైన దంత వైద్యాన్ని అందించేందుకు విష్ణు దంత వైద్య కళాశాల పలు ప్రాంతాలలో అత్యాధునిక వసతులతో ఆసుపత్రులను ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఎంఎల్‌సి వంక రవీంద్రనాథ్, గ్రామ సర్పంచ్ గంగోలు సీతమ్మ, ఖండవల్లి సర్పంచ్ పులిదింటి నాగరాజు, కానూరు సర్పంచ్ భావన మధుపూర్ణచంద్ వివిధ విభాగాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వినయ్, డాక్టర్ ఆర్‌వి.రాజు, డాక్టర్ కార్తీక్ వర్మ, డాక్టర్ రమేష్, డాక్టర్ చైతన్య, రవి కుమార్, రాఘవ రాజు, అశోక్ వైద్య సిబ్బంది, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్కూల్ గేమ్స్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం


ఉషు క్రీడలో పోటీ పడుతున్న విద్యార్థులు

నగరంలోని ఎస్‌కెవిటి కళాశాలలో జరుగుతున్న ఎపి స్కూల్ గేమ్స్ శనివారం ఉత్సాహంగా జరిగాయి. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి సుమారు 600 మంది క్రీడాకారులు ఈ క్రీడల్లో పాల్గొన్నారు. ఈ పోటీలను డిఇఒ కంది వాసుదేవరావు పరిశీలించారు. ఉషు పోటీలు ఉదయం 11 గంటల డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌లో జరిగాయి. సెమీ ఫైనల్ పోటీ ముగిసింది. ఆదివారం ఫైనల్ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. అంతర్ జిల్లాల పోటీలో విజేతలుగా నిలిచిన వారందరూ ఎపి జట్టులో జాతీయ స్థాయి పోటీలకు పంపించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాయామ సంఘం ప్రెసిడెంట్ నాగరాజు, చైర్మన్ రాజశేఖర్, సెక్రెటరీ వీరబాబు, ట్రెజరర్ జయకుమార్, కాకినాడ జిల్లా స్కూల్ గేమ్ కార్యదర్శి, కోనసీమ జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు, జిల్లా జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీలు ఎవిడి ప్రసాదరావు, భువనేశ్వరి పాల్గొన్నారు.

విజయవాడకు తరలిన ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - కొవ్వూరు


విజయవాడలో ధర్నాలో పాల్గొన్న ఉపాధ్యాయులు

మినిమం టైం స్కేల్‌పై పనిచేస్తున్న టీచర్స్‌ను రెగ్యులర్ చేయాలని కోరుతూ విజయవాడలో నిర్వహించిన సదస్సుకు జిల్లా నుంచి పెద్దఎత్తున ఉపాధ్యాయులు తరలివెళ్లినట్లు సంఘ నాయకుడు పి.బెనర్జీ తెలిపారు. కొవ్వూరు డివిజన్‌లో సుమారు 2000 మంది ఆ సదస్సుకు తరలి వెళ్లామన్నారు. ఈ కార్యక్రమంలో రామబ్రహ్మ పతంజలి, కస్తూరి రఘుపతిరావు, మంతెన శ్రీరామరాజు, కొండవీటి మోహనరావు, కొణతల నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు

జిల్లా స్థాయి పోటీలకు 'ప్రతిభ' విద్యార్థులు

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట పట్టణం ప్రతిభ విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు మండలస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీలలో విశేష ప్రతిభను ప్రదర్శించారు. ఈ నెల 9, 10వ తేదీల్లో సామర్లకోట గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన మండల స్థాయి పాఠశాలల క్రీడా పోటీల్లో పలు విభాగాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించి, జిల్లా స్థాయికి ఎంపికైనట్టు విద్యాసంస్థల అధినేత ఎస్‌విజి ప్రకాష్ చెప్పారు. అక్టోబర్ 9న జరిగిన చెస్ అండర్-14 విభాగంలో 8వ తరగతి విద్యార్థులు ఎన్ఎల్ఎన్ నిహాల్ ప్రథమ స్థానం, ఎ.తేజ్ సుదీప్ ద్వితీయ స్థానం సాధించారు. ఖో ఖో అండర్-19 విభాగంలో 9వ తరగతి విద్యార్థి ఐ.మణికంఠ ప్రథమ స్థానం పొందాడు. అక్టోబర్ 10న జరిగిన చెస్ అండర్-14 బాలికల విభాగంలో 9వ తరగతి విద్యార్థిని మట్టపల్లి దేవీ జాహ్నవి ప్రథమ స్థానం, 6వ తరగతి విద్యార్థిని సానా సుభాని షా ద్వితీయ స్థానం సాధించారు. వాలీబాల్ అండర్-14 విభాగంలో 7వ తరగతి విద్యార్థినులు డి.దేవి, కె.పావని, కె.శ్రావణ జ్యోష్ణవి, 9వ తరగతి విద్యార్థిని వి.అనుదేవి యక్షిత జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. వాలీబాల్ అండర్-17 విభాగంలో 9వ తరగతి విద్యార్థిని కె.సాయి లక్ష్మీ తులసి, ఎంపికయ్యారు. వీరిని యాజమాన్యం అభినందించింది.

ప్రజాస్వామ్యాన్ని బలపర్చుకోవాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి - జగ్గంపేట

ప్రజాస్వామ్యాన్ని బలపర్చుకోవాలని మాజీ కేంద్ర మంత్రి, కాంగ్రెస్ పార్టీ సిడబ్ల్యుసి సభ్యుడు ఎంఎం.పల్లంరాజు పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా అవకతవకలపై కాంగ్రెస్ పార్టీ చేపట్టిన దేశవ్యాప్త ఉద్యమంలో భాగంగా శనివారం జగ్గంపేటలో ఓట్ చోర్ గద్దె చోడ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం ఎన్నికల కమిటీలో సుప్రీం కోర్టు జడ్జికి బదులు వారి కేంద్ర మంత్రిని నియమించుకునే విధంగా చట్టం చేసిందన్నారు. దీంతో ఎన్నికల కమిషనర్‌ను వారికి తొత్తుగా వ్యవహరించేవారిని నియమించుకున్నారని ఆరోపించారు. గతంలో జరిగిన ఎన్నికల్లో లక్షల ఓట్లను అదనంగా చేర్చిందనే విషయాన్ని రాహుల్ గాంధీ ఆధారాలతో రుజువు చేశారన్నారు. ఐనా ఎన్నికల కమిషన్ పట్టించుకోకపోవడంతో ఆ విషయాన్ని ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశ్యంతో దేశవ్యాప్తంగా సంతకాల సేకరణ చేపట్టినట్టు తెలిపారు. 3 కోట్ల మంది సంతకాలు సేకరించే ప్రజలు భాగస్వామ్యులు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిసిసి జిల్లా సెక్రటరీ మల్లిపూడి రాంబాబు, పార్టీ జిల్లా అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు, మొయ్యేటి సూర్యప్రకాశ్, మరోతి శివ గణేష్, మొగిలి సురేష్, ఎస్‌విఎస్.బాబు పాల్గొన్నారు.

యానిమేటర్లకు అభినందన

ప్రజాశక్తి - కాకినాడ

15 ఏళ్ల సుదీర్ఘ పోరాటం అనంతరం విఒఎ యానిమేటర్ల మూడేళ్ల కాల పరిమితి జిఒను రద్దుకై పోరాడిన యానిమేటర్లను సిఐటియు జాతీయ ఉపాధ్యక్షురాలు జి.బేబిరాణి అభినందించారు. యానిమేటర్లు మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకోగానే తొలగించి ఆ స్థానంలో మరొకరు నియమించే అన్యాయమైన ఆదేశాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు, స్థానిక రాజకీయ నాయకులు ఈ ఆదేశాలను అడ్డం పెట్టుకుని యానిమేటర్లతో ఇప్పటివరకు గొడ్డు చాకిరీ చేయించుకుని కనీస మర్యాద కూడా ఇవ్వకుండా ఇష్టానుసారం తొలగింపులకు పాల్పడ్డారన్నారు. 15 ఏళ్ల అధికారంలో ఉన్న ప్రభుత్వాలన్నీ ఇలాగే వ్యవహరించాయన్నారు. కనీస వేతనం రూ.26 వేలు, ప్రభుత్వ 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తింపు, పొదుపు సంఘాల పని కాక ఇతర పనులు చేయించుకూడదనే డిమాండ్లపై పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఎపి వెలుగు విఒఎ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గంగాభవాని, రత్నాభాయి, కోశాధికారి మేరీ, ఉపాధ్యక్షురాలు సత్య, కిర్లంపూడి మేరీ, సత్యవతి, దేవి, సుధా, సుశీల ప్రకటన విడుదల చేసిన వారిలో ఉన్నారు.

జెఎన్‌టియుకెలో శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక జవహర్లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌పై మూడు రోజుల శిక్షణా శిబిరం శనివారం ప్రారంభమైంది. ఈ నెల 13వ తేదీ వరకు శిబిరం కొనసాగుతుంది. ఈ కార్యక్రమాన్ని విశిష్ట ఇన్నోవేటర్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఐఇఇఇ స్టూడెంట్ బ్రాంచ్, ఇసిఇ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ఇసిఇ హెచ్ఒడి డాక్టర్ బి.లీలాకుమారి, కన్వీనర్‌గా, ఇసిఇ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పుష్పలత కో ఆర్డినేటర్ గా వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అకడమిక్స్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జివిఎస్ఆర్.దీక్షితులు హాజరై శిక్షణా శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ శిబిరంలో మొత్తం 80 మంది విద్యార్థులు 20 జట్లుగా పాల్గొన్నారు.

రామవరంలో అన్నదానం

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని రామవరం శ్రీ సత్తెమ్మతల్లి ఆలయం వద్ద శనివారం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్ పాల్గొని బాటసారులకు ఆహారం వడ్డించారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి దొడ్డ శ్రీను, పార్టీ జిల్లా సమయుక్త కార్యదర్శి సూరంపాలెం బాలు, పార్టీ నాయకులు మండపాక పాపన్న దొర, మాదారపు వీరబాబు, మెహర్ బాబా, పిల్లి శ్రీను పాల్గొన్నారు.